సాక్షి ప్రకాశం

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



స్వామినాథన్ సిఫార్సులతో రైతులకు న్యాయం

వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని నివారించేందుకు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు.

- 8లో..



మహిళల పాలిట శాపంలా కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో మహిళల పాలిట కూటమి ప్రభుత్వం శాపంలా మారిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ ధ్వజమెత్తారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బర్లీ పొగాకు కొనుగోలుకు గడువు పెంచాలి

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్

ఒంగోలు టౌన్: హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలుకు సెప్టెంబర్ చివరి తేదీ వరకు గడువు పెంచి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ సీజన్‌కు హెచ్‌డీ బర్లీ పొగాకు ఉత్పత్తి 85 లక్షల కిలోలుగా రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా ఈ నెల 6వ తేదీ నాటికి మార్క్‌ఫెడ్, ఇతర ప్రైవేటు కంపెనీలు కలుపుకొని కేవలం 45.27 లక్షల కిలోలకే పరిమితమైందని చెప్పారు. రాష్ట్ర కేబినెట్ నిర్ణయం ప్రకారం కొనుగోలు చివరితేదీ ఈ నెల 20వ తేదీని ప్రకటించిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ గడువు సరిపోదని స్పష్టం చేశారు. శనివారం ఒంగోలులోని ఎల్బీజీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రైతుల ఇళ్లల్లో ఇంకా సంగం కంటే ఎక్కువగా పొగాకు నిల్వలున్నాయని తెలిపారు. వర్షాకాలం దగ్గర పడుతుండడంతో పొగాకు నిల్వ కష్ట సాధ్యంగా మారుతుందని, పొగాకు నాణ్యత కూడా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మొత్తం 24 కొనుగోలు సంస్థల్లో చిన్న వ్యాపారులు, మార్క్‌ఫెడ్ ఎక్కువ శాతం కొనుగోలు చేసినట్లు వివరించారు. రూ.9 వేలకు మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మార్క్‌ఫెడ్ సగటు ధర కిలోకు రూ.90.37 కాగా ప్రైవేటు కొనుగోలుదారులు రూ.70 నుంచి రూ.80 వరకు చెల్లించాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బర్లీ రైతులకు ప్రకటించిన రూ.350ల్లో ఒక్క రూపాయి కూడా రైతులకు అందలేదని విమర్శించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జజ్జూరి జయంతిబాబు, పమిడి వెంకటరావు పాల్గొన్నారు.

బీజేపీ కూటమి పార్టీలను తరిమికొట్టండి

- ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.డి శీలం

చీమకుర్తి రూరల్: బీజేపీ పాలనలో భారతదేశం నాశనమైందని, రాజ్యాంగ సంస్థలను తమ స్వార్థానికి వాడుకుంటున్న బీజేపీ కూటమి పార్టీలను క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం నుంచి తరిమికొట్టాలని ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం అన్నారు. చీమకుర్తిలోని జేఅండ్ఎం కన్వెన్షన్ సెంటర్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రణాళిక సభలో మాట్లాడుతూ బీజేపీ ఏవిధంగా దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తోందో, ప్రజల ఓటు హక్కును హరించి వేస్తూ, ప్రజలను ఎలా మోసం చేస్తోందో గ్రామ స్థాయి వరకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా పసుమర్తి సుధాకర్ బాధ్యతలు చేపట్టే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ సైదా, బాపట్ల జిల్లా పార్టీ ఇన్‌చార్జి గడ్డం పాల్ విజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు, వెంకటేశ్వర్లు, నియోజకవర్గాల సమన్వయకర్తలు పాలపర్తి విజేశ్ రాజ్, పగడాల రంగ స్వామి, సుబ్బారెడ్డితో పాటు పార్టీ నాయకులు మన్నం ప్రసన్న రాజు, నట్టే సుబ్బారావు, తుమ్మల సుబ్బారావు, కొప్పుల శంకర్, వేల్పుల వెంకటేశ్వర్లు, ఇరిగినేని వెంకట నరసయ్య, గోరంట్ల కోటేశ్వర రావు, బొడ్డు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధర గుబాళించి.. జనాన్ని బెంబేలెత్తించి!

బంతి..చామంతి..మల్లి..గులాబీ..కనకాంబరం..లిల్లీ..పూల ధరలు జనాన్ని భయపెడుతున్నాయి. శ్రావణమాసం, వరుసగా పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో పూల డిమాండ్ ఎక్కువగా ఉంది. పూల మార్కెట్‌లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. మొన్నటి వరకూ ఉన్న ధరలపై నాలుగు రెట్లు పెంచేశారు. శుభకార్యాలకు పూలు కొనాలంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొంది. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో వ్యాపారులు చెప్పిందే రేటుగా మారింది. హోల్‌సేల్ మార్కెట్‌లో ఇలా ఉంటే రిటైల్ మార్కెట్ రేట్లు చూసి కొనుగోలుదారులు నివ్వెరపోతున్నారు.

- శ్రావణమాసంలో కొండెక్కిన పూల ధరలు
- మామూలు రోజుల కంటే నాలుగు రెట్లు పెంచి విక్రయాలు
- వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిన పూల వ్యాపారం
- అధికారుల అజమాయిషీ లేకపోవడంతో తెగబడుతున్న వైనం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో రోజుకు 30 టన్నుల పూల విక్రయాలు
- బెంగళూరు, చెన్నై, విజయవాడ, కడియంల నుంచి దిగుమతి



ఒంగోలులోని పూలమార్కెట్‌లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఒంగోలు టౌన్: పూలతో పూజలు, పునస్కారాలు చేయడం తెలుగు ప్రజల సంప్రదాయం. అంతేకాకుండా ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా పూలు లేకుండా గడవదు. గృహ ప్రవేశాలకు, పెళ్లిళ్లకు, పుట్టిన రోజు పండుగలకు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు వ్యాపారాల ప్రారంభోత్సవాలకు ప్రతిదీ పూలతోనే చేయడం రివాజు. దీంతో ఏ ఒక్క చిన్న పండుగ వచ్చినా సరే మార్కెట్‌లో పూలకు గిరాకీ పెరుగుతుంది. పూల వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. అధిక ధరలకు పూలను విక్రయిస్తూ జేబులు గుల్ల చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం, శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఒంగోలు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పూల మార్కెట్ బాట పట్టారు. శ్రావణ శుక్రవారానికి మూడు రోజుల ముందు ధరలతో పోలిస్తే బాబోయ్ అన్నంతగా ఉన్నాయి. వరలక్ష్మి వ్రతం రోజున లక్ష్మీదేవిని పూజించడం వలన సిరిసంపదలు వస్తాయన్న నమ్మకంతో భక్తులు పూల ధర ఎంత ఎక్కువైనా సరే పూలు కొనుగోలు చేశారు. మధ్యతరగతి సామాన్య భక్తులు మాత్రం పూలు కొనలేక అల్లాడిపోయారు.

జిల్లాలో సుమారు 30 టన్నుల పూల అమ్మకం...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పూల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఒంగోలులో కొత్త కూరగాయల మార్కెట్ వద్ద హోల్‌సేల్ పూల వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఇక్కడ 25 హోల్‌సేల్ పూల దుకాణాలున్నాయి. మరో 9 రిటైల్ దుకాణాల్లో పూలు విక్రయిస్తుంటారు. అలాగే అద్దంకి బస్టాండు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 8 రిటైల్ పూల దుకాణాలు ఉన్నాయి. మొత్తం మీద జిల్లా కేంద్రంలో 42 పూల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మార్కాపురంలో 8, అద్దంకి 6, చీరాల 6, కనిగిరి 5, కందుకూరు 10, సింగరాయకొండ 2, పొదిలి 2 దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లా వ్యాప్తంగా 38 మండలాల్లోనూ పూల దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి పూలు అమ్ముతుంటారు. ఒక్క ఒంగోలులోనే రోజుకు సుమారు 15 టన్నుల పూలను విక్రయాలు జరుగుతుంటాయి. 5 టన్నుల గులాబీ, 5 టన్నుల చామంతి, టన్ను జాజిపూలు, 500 నుంచి 600 కిలోల మల్లెపూలు విక్రయిస్తుంటారు. జిల్లా మొత్తం మీద రోజుకు సుమారు 30 టన్నులకు పైగా పూల విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా.



బెంగళూరు నుంచి ధేనువకొండ వరకు..

జిల్లాలో విక్రయించే పూలను వ్యాపారులు బెంగళూరు నుంచి మొదలుకొని ధేనువకొండ వరకు కొనుగోలు చేస్తుంటారు. కర్ణాటకలోని చిక్‌మంగులూరు, రాష్ట్రంలోని కుప్పం, వి.కోట, మదనపల్లి, కర్నూలు, అనంతపురం, తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి చామంతి, గులాబీ, బంతి పూలు దిగుమతి అవుతాయి. గిద్దలూరు, ఈతముక్కల మన్నూరు, మైదుకూరు, ఉదయగిరి నుంచి లిల్లీ పూలు వస్తాయి. చీరాల నుంచి జాజి పూలు, మేదరమెట్ల మండలంలోని ధేనువకొండ నుంచి మల్లె పూలు, అనంతపురం నుంచి కనకాంబరం, చెన్నై నుంచి మరువం, ఈతముక్కల మడనూరు నుంచి తులసిని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే పూలను గుజరాత్ వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఈ ఏడాది పూల ధరలు బాగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవడంతో పూల రేట్లు పెరగడానికి కారణమని చెబుతున్నారు.

పండగొస్తే పూల ధరలకు రెక్కలు..

శ్రావణ మాసం అంటే హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. దీంతో పూలకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. వరలక్ష్మీ వ్రతం రోజున ఒంగోలుతో పాటుగా జిల్లా వ్యాప్తంగా పూలకు బాగా గిరాకీ పెరిగింది. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరా చేసుకొని పూల ధరలు విపరీతంగా పెంచేశారు. మూడు రోజుల ముందు వరకు పావు కిలో చామంతి రూ.30 నుంచి రూ.60 కు విక్రయించగా వరలక్ష్మీ వ్రతానికి ముందు రోజు నుంచి విపరీతంగా పెంచి పావు కిలో చామంతి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించారు. గులాబీ పూల ధరలు కూడా అప్పటి వరకు పావు కిలో గులాబీ పూలు రూ.50కి విక్రయించిన వ్యాపారులు ఒక్కసారిగా రూ.100 నుంచి రూ.150 వరకు పెంచేశారు. మల్లె, కనకాంబరం పూల వైపు చూసే ధైర్యం చేయడంలేదు. సామాన్య రోజుల్లో మూర మల్లెపూలు రూ.20 కు విక్రయించేవారు. కొందరు వ్యాపారులు మూడు మూరల మల్లెపూలు రూ.50 కు కూడా విక్రయించారు. కానీ వరలక్ష్మి వ్రతానికి ముందు రోజు నుంచి మూర మల్లెపూలు రూ.50 నుంచి రూ.70 కు విక్రయించడంతో వినియోగదారులు తెల్లమొహాలేశారు. పండుగకు ముందు కిలో రూ.300 నుంచి రూ.400 వరకు అమ్మకాలు జరిపిన కనకాంబరం పూల ధరలైతే ఏకంగా రూ.800 నుంచి రూ.1000కి పెంచేశారు. రూ.6 విక్రయించే మరువం కట్టను రూ.15 నుంచి రూ.20లకు విక్రయించడంతో భక్తులు ఉసూరుమన్నారు.

అధికారుల అజమాయిషీ లేకపోవడమే కారణమా..

పూల వ్యాపారంలో రైతులకు వచ్చే లాభాల కంటే మధ్య దళారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు దండుకునేదే ఎక్కువగా ఉంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టన్నుల కొద్దీ వ్యాపారం జరుగుతున్నప్పటికీ ఇటువైపుగా అధికారులు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. ప్రతి పండుగకు ముందు రోజు పూల ధరలు నింగినంటుతుంటే అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం లేదు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిపోయిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అజమాయిషీ లేకపోవడంతో దళారులు, వ్యాపారులు ఏకమై పూల ధరలను విపరీతంగా పెంచేసి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరచి పండుగల సమయంలో పూల ధరలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఆదివాసీ చట్టాలు పట్టించుకోని ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు



కొమరంభీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి అటవీ భూములన్నింటినీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకోవడం సంతోషదాయకమన్నారు. ప్రకృతికి దగ్గరగా బతుకుతున్న గిరిజనులు తమ జీవనోపాధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారన్నారు. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9వ తేదీని ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్) వై.వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్) బొట్ల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దేవరపల్లి అంజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకం మదు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు కె.మల్లిఖార్జునరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పేరంప్రసన్న, ఆనం శ్రీను, పిగిలి శ్రీను, గాలేటి వెంకటేశ్వర్లు, కత్తి రవి, బాపట్ల లక్ష్మయ్య, జి.హరి, కనపర్తి గోవిందమ్మ, మేరీకుమారి, వాణి, సయ్యద్ అప్సర్, లక్ష్మికాంతం, రమణమ్మ, అమర్, బాషా, పొట్లూరి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను వివరించండి



వెల్లంపల్లిలో క్యూఆర్ కోడ్ చూపుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: సూపర్ సిక్స్ అంటూ అబద్ధాలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశాడని, బాబు మోసాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని వెల్లంపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును రీకాల్ చేసేలా ప్రతి ఒక్కరూ ఆయన మేనిఫెస్టో అమలు చేయకుండా చేసిన మోసాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు సూచించారు. చంద్రబాబుకు ముఖ్యమంత్రి పదవిలో ఉండే అర్హత లేదని, అటువంటి మోసగాడు రాష్ట్రానికి అవసరం లేదన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్నీ ఇచ్చేశామని బుకాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబును నమ్మితే ఆకాశంలో మేఘాలను చూసి కింద నీళ్లు ఒలకబోసుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. ప్రజలు ఆయన వాగ్దానాలు విని మళ్లీ మోసపోయామని తలలు బాదుకుంటున్నారన్నారు. ఇటీవల సింగపూర్ వెళ్లిన బాబు ఏపీకి ఎన్నివేల కోట్ల పెట్టుబడులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాక కోటిరెడ్డి, నాగులుప్పలపాడు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, కాకర్లపూడి రజిని, పిచ్చిరాజు, నాదెండ్ల మహేష్, కాకర్ల సురేష్, రాయపాటి విల్సన్, కంకణాల సురేష్ అంజమ్మ, సుబ్బారెడ్డి, జయమ్మ, విష్ణు పాల్గొన్నారు.

పాఠశాలల్లోకి నో ఎంట్రీ

- విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాల రాకపై నిషేధం
- కళాశాలల్లోకి సైతం అనుమతిలేదని జీఓ
- కూటమి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు



PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION

ANDHRA PRADESH :: MANGALAGIRI

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వ చర్యలు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా ఉన్నాయి. విద్యార్థి సంఘాలను నియంత్రించి, వారి గొంతును అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకుంది కూటమి సర్కారు. రాజ్యాంగం కల్పించిన విద్యార్థుల హక్కుకూ సంకెళ్లు వేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తోందని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2955 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 188 జూనియర్ కాలేజీలున్నాయి. గత నెలలో విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో వసతుల లేమిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రభుత్వం విద్యార్థి సంఘాలపై కక్ష పెంచుకుని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలకు అనుమతులు ఇవ్వద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

కళాశాల్లోకి రాకూడదంటూ మరో జీఓ

విద్యను వ్యాపారంగా మార్చడం, వసతి గృహాల్లో నాసిరకమైన వసతులు, పలు సమస్యలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు, అధిక ఫీజు వసూలు, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడంపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కళాశాలలపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. దీంతో ప్రభుత్వం మరోసారి జూనియర్ కళాశాల్లోకి సైతం విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ మరో జీఓ జారీ చేసింది. విద్యార్థి సంఘాలు విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల హక్కుల కోసం పోరాడటమే కాకుండా, విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి. నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహనను, హక్కులు, బాధ్యతలను నేర్పిస్తాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వ చర్యల వెనుక విద్యార్థి సంఘాలను అణచివేయడం ద్వారా ప్రశ్నించే, పోరాడే శక్తులను నిలువరించాలని, విద్యార్థుల్లో సామాజిక చైతన్యం లేకుండా చేయాలనే ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధమైనవని, నిరంకుశత్వ ధోరణికి నిదర్శనమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అనాలోచిత నిర్ణయం



ప్రభుత్వ అనాలోచిత విధానాలతో ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఫీజులు, పుస్తకాల పేరుతో ఇప్పటికే రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్నాయి. వీటిని అడ్డుకునేవారు లేకుండా చేయడం కోసం అడ్డగోలు జీఓలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలపై స్పందించే వారు లేకపోతే అధికారులు, ప్రభుత్వం ఎలా చేసినా అడిగేవారు లేకుండాపోతారు.

– మహమ్మద్ ఇబ్రహీమ్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ఆంక్షలు ఎత్తేయాలి



విద్యారంగంలోని సమస్యలపై ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటి హక్కులను కాలరాసేందుకు కూటమి ప్రభుత్వం కుటిల యత్నాలు చేయడం దుర్మార్గం. విద్యను వ్యాపారం చేస్తున్న కళాశాలలపై గళం విప్పితే ఆంక్షలు విధించడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. తక్షణం విద్యార్థి సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి.

– ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు

విద్యార్థి సంఘాలపై ఆంక్షలు దుర్మార్గం



కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఇచ్చిన హామీల అమలుకు విద్యార్థి సంఘాలు నిలదీశాయి. ప్రభుత్వ బడుల్లో, కళాశాలల్లో వసతులపై గళం విప్పాయి. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే విద్యార్థి సంఘాలు ప్రయత్నించాయి. ఆంక్షల పేరుతో విద్యాసంస్థల్లోకి అనుమతులు లేకుండా జీఓలు జారీ చేయడం దుర్మార్గం.

– దద్దనాల తేజ, యుటీఎఫ్ డివిజన్ అధ్యక్షులు

రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలివ్వండి



రజక సంఘం ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మాలకొండయ్య

ఒంగోలు టౌన్: రజక వృత్తిదారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఎల్బీజీ భవనంలో సంఘం నాయకులతో కలిసి ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ జిల్లాలో రజక వృత్తిదారులపై పెత్తందారితనం, కుల వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ఫలితం ఇవ్వమని అడగడం నేరంగా మారిందని, అలాంటి వారిని గ్రామ బహిష్కరణ చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో రజక వృత్తి బలహీనపడడంతో అనేక మంది రజకులు పట్టణాలకు వచ్చి అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్లుగా, ఇస్త్రీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. కొంతమంది రజకులు ఇంటిపనివారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని చెప్పారు. అపార్ట్‌మెంట్ యాజమాన్యాలు కనీస వేతనాలు చెల్లించడానికి సమ్మతించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి బట్టలుతికి వచ్చే మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృత్తి చెరువులపై భూమి హక్కులు కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, గ్రామాల్లో శ్రమకు తగిన ఫలితం దక్కేలా చర్యలు తీసుకోవాలని, ఆధునిక ధోబీ ఘాట్లను నిర్మించాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి సామాజిక పింఛన్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ధర్నాలో రజకులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, ఆవులమంద రమణమ్మ, సర్వేపల్లి యోగమ్మ, మంచికలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో అడవిదుప్పి మృతి



మృతిచెందిన దుప్పికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న డాక్టర్ మునీర్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని వి.బైలు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కుక్కల దాడిలో అడవి దుప్పి మృతి చెందింది. ఈ ఘటన శనివారం వెలుగుచూసింది. ఉదయం గ్రామ సమీపంలోనికి అడవి దుప్పి రాగా గమనించిన కుక్కలు దాన్ని వెంబడించాయి. గ్రామానికి సమీపంలోని జాలు వాగువద్ద కుక్కలు అడవి దుప్పిపై దాడిచేసి గాయపరిచి చంపేశాయి. సమీపంలో పొలాల్లో ఉన్న రైతులు ఈ విషయాన్ని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జగన్నాథ వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కేశవరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన అడవిదుప్పిని పరిశీలించారు. పశువైద్యాధికారి మునీర్ పోస్టుమార్టం చేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పొదిలి రూరల్: స్థానిక విశ్వనాథపురం ఆంజనేయస్వామి గుడి దగ్గర ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే..ఆంజనేయస్వామి ఆలయం దగ్గర స్పీడ్‌బ్రేకర్ ఉండటంతో నెమ్మదిగా వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన బస్సు తగలడంతో ట్రాక్టర్ ట్రక్కు పైభాగం కిందపడింది. బస్సు ముందుభాగం దెబ్బతింది.

కత్తులతో దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురంలో ఇద్దరు వ్యక్తులు కత్తులతో పరస్పరం దాడి చేసుకోవటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానిక ఒంగోలు, నంద్యాల రోడ్డులో రాజేశ్వరరావు పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..విశ్వనాథపురానికి చెందిన మాధవరెడ్డి అనే వ్యకి ఓ మహిళను గత కొంత కాలంగా ఫోన్‌లో వేధిస్తున్నాడు. ఈ విషయమై బాధిత మహిళ, బంధువులైన విష్ణువర్ధన్‌రెడ్డి, మరొక వ్యక్తి మాధవరెడ్డిని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా వారి బంధువులు చికిత్స నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దరిని ఒంగోలుకు తరలించారు. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వైద్యశాల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

గ్రామ స్వరాజ్యానికి తూట్లు

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఊరూరా సచివాలయాలు వెలిశాయి. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న ఊర్లోనే ప్రజలకు అన్నీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఉన్నత లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. సచివాలయాల సేవలను నిర్వీర్యం చేసేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు మళ్లీ మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. నాడు కళకళలాడిన సచివాలయాలు.. ప్రస్తుతం వెలవెలబోతున్నాయి.

–సాక్షి, ఒంగోలు







అర్జీదారులతో కిటకిటలాడుతున్న అల్లూరు సచివాలయం (ఫైల్)



అర్జీదారులు లేక వెలవెలబోతున్న అల్లూరు సచివాలయం

మహిళల పాలిట శాపంలా కూటమి ప్రభుత్వం

- కుటుంబాల్లో చిచ్చు పెడుతోన్న మద్యం వినియోగం
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ

ఒంగోలు సిటీ:

రాష్ట్రంలో మహిళల పాలిట కూటమి ప్రభుత్వం శాపంలా మారిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాలు మహిళల జీవితాలను నాశనం చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. మద్యం విక్రయాలు పెంచుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని, తాజాగా రూ.5 లక్షలు చెల్లించి పర్మిట్ రూంలు పెట్టుకునేలా అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం షాపుల్లో 33 శాతం తగ్గించి, పర్మిట్ రూంలను



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ

రద్దు చేసి, ఊరూరా ఏర్పాటైన 43 వేల బెల్టు షాపులు పూర్తిగా రద్దు చేయడంతో మద్యం వినియోగం తగ్గిందన్నారు. కానీ దీనికి పూర్తి భిన్నంగా కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వమే మద్యం విక్రయాలను ప్రోత్సహించడం ద్వారా ప్రజలు ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువ ఆదాయం వస్తుందన్నట్లుగా వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూంలు ఏర్పాటు చేస్తే మద్యపానానికి అడ్డాగా మారతాయన్నారు. గుడి, బడి అని తేడా లేకుండా కూటమి ప్రభుత్వంలో ఎక్కడపడితే అక్కడ షాపులు ఏర్పాటు చేయడంతో మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. చాలా గ్రామాల్లో మద్యం బాటిళ్లను బెల్టుషాపుల్లో కాకుండా రోడ్డు పక్కన విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత బస్సు ప్రయాణం అంతా పచ్చిమోసం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంతా పచ్చి మోసం అని విమర్శించారు. మహిళలకు బస్సుల్లో ఫ్రీ అంటూనే కొర్రీలు పెట్టారన్నారు. కేవలం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రో సర్వీసుల్లోనే మహిళలు ఫ్రీ జర్నీ అని ప్రకటించారనీ, ఈ సర్వీసులన్నీ దూర ప్రాంతాలకు వెళ్లవన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులు 12 వేలు ఉంటే మహిళలకు సుమారు 6 వేల బస్సుల్లో మాత్రమే ఫ్రీగా ప్రయాణానికి అనుమతిస్తామనడం పచ్చిమోసం కాదా అని ప్రశ్నించారు. ఆర్డినరీ బస్సులు 30 కిలోమీటర్లు దాటి వెళ్లవనీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఒక రూటులో 150 కిలోమీటర్లు మించి వెళ్లవని, అలాంటప్పుడు మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సుల్లో ఫ్రీ గా ఎలా తిరుగుతారని ప్రశ్నించారు. ఏడాది పాటు హామీలు ఏం ఇవ్వకుండా ఇప్పుడు అరకొరగా ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లాలంటే ఈ బస్సుల ద్వారా వెళ్లగలమా అని ప్రశ్నించారు. మాటిచ్చి మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు కనపర్తి గోవిందమ్మ, మేరీకుమారి, వి.వాణి, లక్ష్మీకాంతం, పేరం ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు వన్‌టౌన్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు అన్నారు. నగరంలోని గిరిజన భవన్‌లో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ ఇటీవల పుల్లలచెరువు మండలం నరజాముల తండాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఆయా భూములపై హక్కులను నిర్ధారించేందుకు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. గిరిజన ఆవాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజనులు స్వశక్తితో జీవనోపాధులు పెంపొందించుకునేందుకు ప్రభుత్వం ఇస్తోన్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు గిరిజన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ లక్ష్మనాయక్ సహకారంతో అందించారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, గిరిజన నాయకులు పేరం సత్యం తదితరులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డీఆర్‌ఓ



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తండ్రిని చంపాడని గొంతుకోసి..

- తీవ్ర గాయాలతో వైద్యశాలలో చికిత్స



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

ముండ్లమూరు(దర్శి): తండ్రి చంపాడని కక్ష పెట్టుకున్న తనయుడు గొంతు కోసి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి సుంకరవారిపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గత ఏడాది మే 20న నల్లబోతుల బ్రహ్మయ్య హత్యకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆయన కుమారుడు వీరాంజనేయులు వెంకటేశ్వర్లుపై కక్ష పెట్టుకున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో రామాలయం ప్రతిష్ఠ సందర్భంగా ఆలయం వద్ద భోజనాలు చేసి ఇంటికి వస్తున్న వెంకటేశ్వర్లును వీరాంజనేయులతో పాటు మరో ఇద్దరు కలిసి గొడవ పడ్డారు. ముగ్గురు కలిసి వెంకటేశ్వర్లును కిందపడేసి కత్తితో గొంతు కోసి పలు చోట్ల గాయాలు చేసి వెళ్లిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆటోలో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు ఒంగోలుకు తరలించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

దొనకొండ: మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన దొండపాటి బ్రహ్మయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఎస్సై త్యాగరాజు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన బ్రహ్మయ్య గ్రామంలో పిల్లలతో కలిసి ఆడుకుంటున్న 8 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేసుకున్నాడు.. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే వెళ్లి తలుపులు కొట్టగా తలుపులు తెరుచుకోకపోవడంతో బలంగా తన్నడంతో తెరుచుకున్నాయి.. ఆ సమయంలో బాలిక ఏడుస్తూ ఇంట్లో నుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది. ఇది గమనించిన బ్రహ్మయ్య అక్కడ నుంచి పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆ మృతదేహం నవీన్‌ది కాదు

కొత్తపట్నం: ఒంగోలు అగ్రహారం గేటు వద్ద రెండు రోజుల క్రితం అనుమానాస్పదంగా లభించిన మృతదేహం ధన్యాసి నవీన్‌ది కాదని పోలీసులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా బోగోలు మండలం చినరాయనిపాలెం గ్రామానికి చెందిన ధన్యాసి నవీన్ బేల్దారీ పని నిమిత్తం కరీంనగర్ వెళ్లి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రజిత అనే యువతితో పరిచయమై ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. అయితే ఇటీవల కొత్తపట్నం మండలం మడనూరు గ్రామానికి చెందిన మరో యువతితో సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో నవీన్ ఆ యువతి ఇంటికి రాగా బంధువులు మందలించి పంపించివేశారు. అయితే నవీన్ అప్పటి నుంచి కనిపించడం లేదు. దీంతో గత నెల 28వ తేదీన నవీన్ అదృశ్యమైనట్లు తల్లి కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ ఒంగోలు అగ్రహారం గేటు వద్ద మురుగు గుంతలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కొత్తపట్నం, తాలుకా పోలీసులు మృతదేహం వద్దకు చేరుకున్నారు. అయితే తల్లి ఫిర్యాదులో ఇచ్చిన గుర్తులు మృతదేహంపై లేకపోవడంతో కొత్తపట్నం ఎస్సై మృతదేహం మాది కాదని తాలుకా పోలీసులకు అప్పగించారు. అయితే తల్లి, బంధువులు మాత్రం మృతదేహం నా కుమారుడిదేనని వాదించడంతో పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు. అయితే మృతదేహం దుర్వాసన వస్తుండటంతో ఒంగోలు కమ్మపాలెం శ్మశాన వాటికలోనే దహన సంస్కారాలు చేశారు. అయితే కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు నవీన్ ఫోన్‌కాల్స్ ఆధారంగా కరీంనగర్ వెళ్లి నవీన్ భార్యను విచారించారు. విచారణలో నవీన్ బతికే ఉన్నాడని, సోషల్ మీడియా ద్వారా కాల్స్ కూడా చేస్తున్నట్లు చెప్పింది. దీంతో ఆ మృతదేహం నవీన్‌ది కాదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

స్వామినాథన్ సిఫార్సులతోనే రైతులకు న్యాయం

ఒంగోలు టౌన్: వ్యవసాయ రంగంలో సంక్షోభం నివారించేందుకు స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయడం ఒక్కటే మార్గమని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య చెప్పారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తే రైతులకు గిట్టుబాటు ధరలు లభించి వ్యవసాయాన్ని కొనసాగిస్తారన్నారు. నగరంలోని ఎల్బీజీ భవనంలో శనివారం ప్రొఫెసర్ స్వామినాథన్ శత జయంతి సభ జరిగింది. సభకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు వామపక్షాల డిమాండ్ మేరకు యూపీఏ ప్రభుత్వం 2004లో స్వామినాథన్ కమిషన్ వేసిందని గుర్తు చేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన స్వామినాథన్ ఇచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకొని ఉంటే రైతులు రోడ్డెక్కే దుస్థితి ఉండేది కాదన్నారు. కమిషన్ నివేదిక ప్రకారం పేదల చేతికి భూమి ఇవ్వకుండా సామాజిక సమానత్వాన్ని సాధించడం కష్టమని చెప్పారని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ఉంటేనే వ్యవసాయరంగం సుభిక్షంగా కొనసాగుతుందని చెప్పారు. ప్రాజెక్టును నిర్మించడం ద్వారా సాగుకు అవసరమైన నీరిందివ్వాల్సిన అవసరముందన్నారు. మద్దతు ధరలను నిర్ణయించడంలో సీ2 ప్లస్ 50 ఫార్ములాను అమలు చేయాలని స్వామినాథన్ సూచించారని చెప్పారు. కమిషన్ సూచనలను పాటించకపోగా వ్యవసాయ రంగంలో 10 శాతానికి మించి ఉండాల్సిన అవసరం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలతో రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. వ్యవసాయాన్ని కాపాడుకోవడం దేశ ప్రజలందరి బాధ్యతని, ఇందుకోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీకాంత్ కొల్లూరు, బెజవాడ వెంకటేశ్వర్లు, అబ్బూరి శ్రీనివాసరావు, గాలి వెంకట్రామిరెడ్డి, సంతు వెంకటేశ్వర్లు, రాజశేఖరరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రసాద్, ఊస వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ట్రాక్టర్‌కు నిప్పుపెట్టిన దుండగులు

పుల్లలచెరువు: మండలంలోని శతకోడు గ్రామంలో పామాయిల్ తోట వద్ద ఉన్న ట్రాక్టర్‌కు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై సంపత్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడు గంగవరపు సాంబులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇలాంటి ఘటనలకు పాల్పడటం దారుణమని, ఇలాంటివి చేస్తే వదిలిపెట్టే ప్రస్తకే లేదన్నారు.



తగులబడిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై